సాక్షి
జగిత్యాల

సోమవారం । 19 । జూన్ । 2023



పోచమ్మకు బోనాలు

జగిత్యాలరూరల్ : జాబితాపూర్‌లోని కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు.



రాజన్న సన్నిధిలో భక్తులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
39.0/30.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. రోజంతా ఎండ తీవ్రత కొనసాగుతుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.

అడవితల్లికి పచ్చతోరణం

- ఆహ్లాదం పంచే రేలా రకం మొక్కలు
- వన్యప్రాణుల ఆకలి తీర్చే అల్లనేరేడు పండ్లమొక్కలు
- పర్యాటకులకు నీడనిచ్చే తెల్లమద్దికీ ప్రాధాన్యం
- తొమ్మిదో విడత హరితహారంలో నాటే మొక్కలివే
- సిద్ధమైన సారంగాపూర్ అటవీ ప్రాంతం
- ఒకేరోజు రెండు వేలు నాటేందుకు ప్రణాళిక
- నేడు అట్టహాసంగా తెలంగాణ హరితోత్సవం



రోడ్డుకు ఇరువైపులా పచ్చదనం పంచుతున్న చెట్లు

సారంగాపూర్(జగిత్యాల): సారంగాపూర్ అటవీ ప్రాంతం ప్రకృతి సోయగాలకు పెట్టింది పేరు.. నిండు వేసవిలోనూ జళకళతో అబ్బురపరిచే బతుకమ్మకుంట.. ఎటుచూసినా పచ్చదనం పంచే నేలతల్లి.. ఆకట్టుకునే రంగురంగుల పూలు.. సువాసనలు వెదజల్లే పరిసరాలు.. వన్యప్రాణులకు అనువైన ఆవాసంగా మారిన అడవితల్లి.. వెరసి సోమవారం ప్రారంభించే తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమానికి వేదికైంది.

17 ఏళ్లక్రితం అంకురార్పణ..


- సారంగాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి దాదాపు 800 మీటర్ల దూరంలో బతుకమ్మ కుంటను సుమారు 17ఏళ్లక్రితం తవ్వించారు.
- గతంలో దీనిని హిమ్మత్‌రావుకుంట అని గ్రామస్తులు పిలుచుకునేవారు.
- ఏటా ఈ కుంటలో బతుకమ్మలను నిమజ్జనం చేయడంతో ఆ తర్వాత దానికి బతుకమ్మ కుంటగా పేరు వచ్చింది.
- ఏటా వర్షాకాలంలో దీని సమీపంలోని గుట్టల నుంచి వచ్చే వర్షపునీటితోపాటు, నేలపై పరిచినట్లు ఉండే పచ్చనిచెట్లు, ఆహ్లాదకర వాతావరణం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.
- దీంతో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరితోత్సవం (తొమ్మిదో విడత హరితహారం) కార్యక్రమాన్ని ఇక్కడే ప్రారంభించేందుకు జిల్లా అటవీశాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది.
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ యాస్మిన్‌బాషా తదితరులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

మూడు రకాలు.. రెండు వేల మొక్కలు..

బతుకమ్మకుంటకు ఎగువన సోమవారం ఒకేరోజు రెండు వేల మొక్కలు నాటడానికి ఉపాధిహామీ కూలీలతో ఇప్పటికే గుంతలు తవ్వించారు. జిల్లాలోని రంగపేట, కల్లెడ గ్రామాల పరిధిలోని అటవీ శాఖ నర్సరీల నుంచి మొక్కలు తీసుకొచ్చి నాటుతారు. సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో మొక్కలు నాటడానికి ఏర్పాట్లు పూర్తిచేశారు.

ఆకలి తీర్చేందుకు అల్లనేరేడు..

- వన్యప్రాణులు, పర్యాటకుల ఆకలి తీర్చేందుకు ఈసారి అల్లనేరేడు మొక్కలు నాటాలని అధికారులు నిర్ణయించారు.
- పర్యాటకులే కాదు.. వన్యప్రాణులు సేద దీరేందుకు వీలుగా నీడనిచ్చే తెల్లమద్ది మొక్కలనూ నాటుతారు.
- అటవీ ప్రాంతం అందంగా కనిపించేలా ఆకట్టుకునే పుష్పాలు పూచే రేలా మొక్కలు కూడా నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.
- ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు ఒకేరోజు 2 వేల మొక్కలు నాటడానికి అన్నీ సిద్ధం చేశారు.



నీటితో కళకళలాడుతున్న బతుకమ్మకుంట

ప్రజలకు అవగాహన

హరితహారం ద్వారా కలిగే ప్రయోజనాలు, మొక్కల పెంపకం ద్వారా లబ్ధిపొందే విధానం తదితర అంశాలపై అతిథులు ఉపన్యసిస్తారు. ప్రధానంగా మానవ మనుగడకు ప్రశ్నార్థకంగా మారుతున్న ప్రకృతి సమతుల్యత దెబ్బతినకుండా ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తారు.

మొక్కల ఎదుగుదలకు మంచి ప్రాంతం



సారంగాపూర్ అటవీప్రాంతంలో నల్లరేగడి, ఎర్రనేలలు అధికంగా ఉన్నాయి. మొక్కలు ఎదిగేందుకు అనుకూల వాతావరణం ఉంది. ఇప్పటివరకు చేపట్టిన మొక్కలు నాటి, సంరక్షించే పనులు వందశాతం విజయవంతమయ్యాయి. ప్రస్తుతం మొక్కలు నాటే నేలలో తేమశాతం అధికంగా ఉంది. అదీగాక బతుకమ్మ కుంట సందర్శనకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రోజూ వందల మంది పర్యాటకులు వస్తారు. అందుకే తొమ్మిదో విడత హరితహారం ఇక్కడ ప్రారంభించాలని నిర్ణయించాం.

– వెంకటేశ్వర్‌రావు, డీఎఫ్‌వో

కార్యక్రమం నిర్వహణ ఇలా..

సోమవారం ఉదయం 9 గంటల నుంచి మొక్కలు నాటడం ప్రారంభిస్తారు. అటవీశాఖ ఇప్పటివరకు చేపట్టిన వివిధ పనుల ప్రగతిపై రూపొందించిన వీడియోలను వేదిక వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శిస్తారు. మొక్కల విలువ, వాటివల్ల కలిగే ప్రయోజనం, పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల వృద్ధి, వన్యప్రాణుల రక్షణ, ఇప్పటివరకు నిర్వహించిన హరితహారం, ఎనిమిది విడతల్లో అటవీశాఖ నాటిన మొక్కల వృద్ధి, భవిష్యత్‌లో చేపట్టే పనుల తీరుపైనా ప్రదర్శన ఉంటుంది. వీటితోపాటు ఫొటో ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేస్తున్నారు.



మొక్కలు నాటేందుకు తవ్విన గుంతలు

న్యూస్‌రీల్

మంచినీళ్ల పండుగ బహిష్కరణ



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మల్లాపూర్(కోరుట్ల): వాల్గొండలో ఆదివారం చేపట్టిన తెలంగాణ మంచినీళ్ల పండుగను గ్రామస్తులు బహిష్కరించారు. తొలుత గ్రామ పంచాయతీ మార్గంలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. తమకు మిషన్ భగీరథ నీరు అందడంలేదని గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోడం లేదన్నారు. తమకు తాగునీరు అందించలేని అధికారులు.. మంచినీళ్ల పండుగ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. సమాచారం అందుకున్న అధికారులు.. ఆందోళనకారుల వద్దకు వెళ్లారు. మంచినీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. ప్రతీకాలనీకి తాగునీరు అందించాలని పంచాయతీ కార్యదర్శి వసంత్‌కు వినతిపత్రం అందించారు. మాజీ సర్పంచ్ ఎండీ జమాల్, నాయకులు క్యాతం వెంకట్‌రెడ్డి, దండవేని నర్సయ్య, మహిళలు పాల్గొన్నారు.

ఇంటింటా మొక్కలు నాటాలి



మొక్కలు పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సోమవారం చేపట్టే హరితోత్సవంలో ఇంటింటా మొక్కలు నాటాలని డీఆర్డీవో లక్ష్మీ నారాయణ సూచించారు. అమ్మక్కపేట నర్సరీలోని మొక్కలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ బాలే శివాజీ, ఎంపీడీవో ప్రభు, ఇన్‌చార్జి ఏపీవో వినోద్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదగాలి



మోహన్‌ను సన్మానిస్తున్న నాయకులు

కథలాపూర్(వేములవాడ): రైతులు చైతన్యవంతులై రాజకీయంగా ఎదగాలని ఆద్య గోలి ఫౌండేషన్ చైర్మన్ గోలి మోహన్ సూచించారు. సిరికొండలో ఆదివారం జరిగిన మున్నూరుకాపు సామాజిక వర్గం ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రైతులు పంటలు పండించడానికే అధిక సమయం కేటాయిస్తూ రాజ్యాధికారానికి దూరమవుతున్నారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాలని ఆయన కోరారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను వేములవాడ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తానని, అన్నివర్గాలు మద్దతు ఇవ్వాలని కోరారు. బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఆకుల నర్సయ్య, గాండ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

66 ఆలయాలకు 'ధూపదీప నైవేద్యం' నిధులు



పూజలు చేస్తున్న అర్చకుడు

కథలాపూర్(వేములవాడ)/గొల్లపల్లి/ధర్మపురి: జిల్లాలోని 220 ఆలయాలకు ఇప్పటికే ధూపదీప నైవేద్యం పథకం కింద నిధులు మంజూరయ్యాయి. తాజాగా 66 ఆలయాలను ఈ పథకం కిందకు తీసుకొస్తూ దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. జగిత్యాల నియోజకవర్గంలో 16, వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్, మేడిపెల్లి మండలాల్లో మూడు, కోరుట్ల నియోజకవర్గంలో 20, ధర్మపురి నియోజకవర్గంలో మరో 20, చొప్పదండి నియోజకవర్గంలోని మల్యాల, కొడిమ్యాల మండలాల్లో ఏడు ఆలయాలను కొత్తగా ధూపదీప నైవేద్యం పథకం కిందకు తీసుకొస్తూ నిధులు మంజూరు చేశారు.

నేటి ప్రజావాణి రద్దు

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదివారం తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణలో అధికారులు, ఉద్యోగులు నిమగ్నమై ఉన్నారని, అందుకే ఈనెల19వ తేదీన నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

హరితోత్సవాన్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లాలో చేపట్టే హరితోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా కోరారు. ఆదివారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. హరితోత్సవంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో భాగస్వాములు కావాలన్నారు. ప్రధానంగా సారంగాపూర్ మండలం బతుకమ్మకుంట, ధర్మపురి మండలం నేరెళ్ల, వెంకట్రావుపేట, మెట్‌పల్లి అర్బన్ పార్క్‌లో హరితోత్సవం చేపడతామని పేర్కొన్నారు. ఈసందర్భంగా విరివిగా మొక్కలు నాటుతామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ విజేత బొమ్మెన జట్టు



బహుమతి అందిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

కథలాపూర్(వేములవాడ): జిల్లాస్థాయి ఇన్విటేషన్ క్రికెట్ టోర్నీ విజేతగా బొమ్మెన జట్టు నిలిచినట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మండలకేంద్రంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న టోర్నీ ఆదివారం ముగిసింది. వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం 44 క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీల్లో బొమ్మెన, పెగ్గెర్ల గ్రామాల జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో బొమ్మెన జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, క్రీడాపోటీలను క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఒకసారి ఓటమి పాలైతే మరోసారి విజయం సాధిస్తారని అన్నారు. అంత మాత్రాన ఓటమి పాలైన వారు అసంతృప్తికి లోను కావొద్దని సూచించారు. పట్టుదలతో సాధన చేస్తే ఏదైనా సాధ్యమని, క్రీడాకారులు కూడా విజయం సాధించేందుకు క్రమం తప్పకుండా క్రీడల్లో సాధన చేయాలని సూచించారు. అనంతరం విజేత జట్టుకు జ్ఞాపికలతోపాటు రూ.12 వేల నగదును కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధానకార్యదర్శి పిడుతు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చెల్లపెల్లి అంజయ్య, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చకచకా 'ఎత్తిపోతల'

- అక్కపెల్లి చెరువులోకి గోదావరి జలాలు
- శరవేగంగా సాగుతున్న పైపులైన్ నిర్మాణం
- రూ.60.80కోట్లతో అభివృద్ధి పనులు
- 4,500 ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యం
- తీరనున్న అన్నదాతల దశాబ్దాల కల



ధర్మపురి సమీప గోదావరి తీరంలో కొనసాగుతున్న సంప్ నిర్మాణం పనులు

ధర్మపురి: అన్నదాతల దశాబ్దాల కల కొద్దిరోజుల్లో నెరవేరబోతోంది. రెండు పంటలకు నీళ్లు అందించాలనే ఆశ తీరబోతోంది. ఎత్తిపోతల ద్వారా పురాతన అక్కపెల్లి చెరువులో నీరు నింపి.. ఆయకట్టుకు సాగునీరు అందించే పనులు చకచకా కొనసాగుతున్నాయి. ఎత్తిపోతల అందుబాటులోకి వస్తే.. దాని పరిధిలోని సుమారు 4,500 ఎకరాలు సస్యశ్యామలమవుతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

0.15 టీఎంసీలు.. రూ.60.80కోట్లు..

- పట్టణ సమీపంలో ఉన్న అక్కపెల్లి చెరువు నీటి నిల్వ సామర్థ్యం 0.15 టీఎంసీలుగా అధికారులు నిర్ధారించారు.
- పట్టణ సమీపంలోని గోదావరి నది నుంచి నీరు ఎత్తిపోసి చెరువులో నింపాలనేది వారి ప్రణాళిక.
- మంత్రి కొప్పుల ఈశ్వర్ చొరవతో ఇందుకోసం రూ.60.80 కోట్లు ఇటీవల మంజూరయ్యాయి.
- కావేరీ ఇన్‌ఫ్రా కంపెనీ మూడు నెలల క్రితం పనులు ప్రారంభించింది.
- ఏడాదిలోగా పథకం పనులు పూర్తిచేయడం లక్ష్యంగా నిర్దేశించారు.
- ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

గోదావరి నుంచి అక్కపెల్లి చెరువులోకి..

గోదావరి నది నుంచి అక్కపెల్లి చెరువు వరకు పైపులైన్ నిర్మిస్తారు. ఎత్తిపోతల ద్వారా చెరువును నీటితో నింపుతారు. ఇందుకోసం ఇంటిక్ పైపులైన్ ద్వారా జాక్‌వెల్ నిర్మిస్తారు. 510 హెచ్‌పీ సామర్థ్యంగల 4 విద్యుత్ మోటార్లు బిగిస్తారు. వీటిద్వారా 55 క్యూసెక్కుల నీటిని పైపులైన్ల ద్వారా తరలిస్తారు. ఇందుకోసం సుమారు 4.50 కి.మీ. పొడవుతో పైపులైన్ నిర్మాణం చేపట్టారు. చెరువు వద్ద ప్రధాన కుండీ నిర్మిస్తారు. చెరువును నీటితో నింపడానికి అక్కడ ఒక కనెక్షన్ ఇస్తారు. చెరువు నీటితో పూర్తిగా నిండాక సమీపంలోని కుంటలను గ్రావిటీ ద్వారా నింపేందుకూ ప్రణాళిక రచించారు.

గోదావరి వద్ద మెయిన్ సంపు..

- ఎత్తిపోతలకు ప్రధానమైన జాక్‌వెల్(సంపు) గోదావరి నది వద్ద నిర్మిస్తున్నారు.
- దీనికోసం లోతైన గుంత తవ్వుతున్నారు.
- దీనిద్వారా బయటకు నీళ్లు ఎత్తిపోసి.. పైపుల ద్వారా అక్కపెల్లి చెరువులోకి తరలిస్తారు.
- చెరువు నీటితో కమలాపూర్, నాగారం, బుద్దేశ్‌పల్లె, కొరండ్లపల్లె, నర్సయ్యపల్లె ఆయకట్టుకు సాగునీరు అందిస్తారు.

దొంతాపూర్ ఎత్తిపోతలకు రూ.6.50 కోట్లు..

- దొంతాపూర్ ఎత్తిపోతల్లో భాగంగా చేపట్టే 3.7కి.మీ. పొడవైన పైపులైన్ నిర్మాణానికి మంత్రి కొప్పుల చొరవతో అదనంగా రూ.6.50 కోట్లు మంజూరయ్యాయి. గతంలో 1,800 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూ.18 కోట్లు మంజూరయ్యాయి. వీటితో పనులు కూడా పూర్తిచేశారు.

అక్కపెల్లి ఎత్తిపోతల ప్రొఫైల్

నీటి నిల్వ సామర్థ్యం (టీఎంసీలు)	0.15
పైపులైన్‌నిర్మాణం	గోదావరినది – అక్కపెల్లి చెరువు
మంజూరైన నిధులు (రూ.కోట్లలో)	60.80
సాగులోకి వచ్చే భూములు (ఎకరాల్లో)	4,500

అమ్మానాన్నల జ్ఞాపకార్థం



గోదావరి తీరంలోని మోరెల్లవాగు సర్వే నంబరు 70, 73లో చేపట్టే అక్కపెల్లి చెరువు అభివృద్ధి పనులకు నా 15 గుంటలు విరాళంగా ఇచ్చా. మా అమ్మానాన్నల జ్ఞాపకార్థం భూదానం చేశా. ప్రజల కోసం చేపట్టిన చెరువు పనులకు భూదానం చేయడం సంతోషంగా ఉంది.

– భీమనాథి అశోక్‌మంగ, భూదాత

అక్కపెల్లికి పూర్వవైభవం



అక్కపెల్లి చెరువును అభివృద్ధి చేయడం ద్వారా చెరువుకు పూర్వ వైభవం వస్తుంది. గోదావరి నది నుంచి అక్కపెల్లి చెరువులోకి ఎత్తిపోతల ద్వారా సాగునీరు తరలించి పూర్తిస్థాయిలో నింపుతాం. దీనిద్వారా ఆయకట్టు పరిధిలోని రైతుల వ్యవసాయభూముల్లో రెండు పంటలకు నీళ్లు అందుతాయి.

– కొప్పుల ఈశ్వర్, మంత్రి

పోలీసుల సేవలు ప్రశంసనీయం



ప్రశంస పత్రం అందిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్



గంగాహారతి ఇస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

- సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాలక్రైం: శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులు దేశంలోనే అగ్రస్థానంలో నిలిచారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశంసించారు. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక సుమంగళి గార్డెన్స్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన తెలంగాణ దశాబ్ద ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక పోలీస్‌శాఖలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం శ్రమిస్తూనే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సేవలు అందిస్తున్నారని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాల నియంత్రణకు కృషి చేస్తోందని చెప్పారు. అనంతరం ఆయుధాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, జాగిలాల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఎస్పీ భాస్కర్, ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, రమేశ్ బాబు, సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీ రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, అదనపు కలెక్టర్లు లత, మకరంద్, డీఎస్పీలు ప్రకాశ్, రవీందర్‌రెడ్డి, రవీంద్ర కుమార్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఘనంగా గంగాహారతి

ధర్మపురి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ధర్మపురి శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఆధ్యాత్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో గంగాహారతి జరిపారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈకార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీలు బత్తిని అరుణ, బాదినేని రాజేందర్, రేనోవేషన్ కమిటీ చైర్మన్ రామన్న పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో కొట్లాటలుండేవి

- తెలంగాణ రాకముందు నీళ్ల గోస ఉండేది
- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): తెలంగాణ రాకముందు తాగునీటి కోసం గ్రామీణ మహిళలు ఖాళీ బిందెలతో కొట్లాడుకునేవారని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత గుర్తుచేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా డబ్బా వాటర్‌గ్రిడ్ వద్ద ఆదివారం మంచినీళ్ల పండుగ నిర్వహించారు. తొలుత నీటి శుద్ధి తీరును ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో కలిసి పరిశీలించారు. అనంతరం వసంత మాట్లాడారు. వేసవి వచ్చిందంటే గతంలో మంచినీళ్ల కోసం ధర్నాలు, నిరసనలు, ఉద్యమాలు చేసేవారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక సీఎం కేసీఆర్ ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తున్నారని తెలిపారు. జిల్లా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు డబ్బా గ్రామం వద్ద వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేశారని చెప్పారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, కేసీఆర్ కరీంనగర్ ఎంపీగా గెలిచిన తర్వాత డబ్బా వద్ద రూ.300 కోట్లతో ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేయాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక మిషన్ భగీరథ కింద వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేశారని తెలిపారు. దీనిద్వారా జిల్లాలోని 5 మున్సిపాలిటీలు, 20 మండలాలకు స్వచ్ఛమైన మంచినీరు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మకరంద్, ఆర్డీవో వినోద్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి శివాజీ, ఎంపీపీలు భీమేశ్వరి, సరోజ, సాయిరెడ్డి, జెడ్పీటీసీలు భారతి, లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్లు సుజాత, అన్నం లావణ్య, కమిషనర్లు జగదీశ్వర్‌గౌడ్, ఆయాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 990వ ర్యాంక్


రిష్యంత్‌రెడ్డి

జగిత్యాలరూరల్/ సారంగాపూర్: ఆలిండియా జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జగిత్యాల పట్టణంలోని అరవింద్‌నగర్‌కు చెందిన బేతి కృష్ణారెడ్డి కుమారుడు రిష్యంత్‌రెడ్డి ఓపెన్ కేటగిరీలో 990వ ర్యాంక్ సాధించాడు. దీంతో తనకు ఐఐటీలో సీటు వస్తుందని తెలిపాడు. ఈ సందర్భంగా అతన్ని పలువురు అభినందించారు.

కాంగ్రెస్ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడి నియామకం


వెంకటేశ్

వెల్గటూర్(ధర్మపురి): కాంగ్రెస్ పార్టీ మత్స్యకారుల సంఘం వెల్గటూర్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గుమ్ముల వెంకటేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రజనీకాంత్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన జిల్లా అధ్యక్షుడికి, సహకరించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ ఉద్యమంలో మీడియాదే కీలకపాత్ర

వెల్గటూర్(ధర్మపురి): తెలంగాణ ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీ వరకు తీసుకెళ్లడంలో మీడియా పాత్ర కీలకమని బీఎస్పీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇథనాల్ పరిశ్రమ బాధిత పాశిగామ, స్తంభంపల్లి గ్రామస్తులతో కలిసి ఆయన మాట్లాడారు. ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా విలేకరులే ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రస్తావించడం శోచనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు, ప్రభుత్వానికి విలేకరులు వారధిగా ఉంటున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చడం, ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో కృషి చేస్తున్నారని అన్నారు. సమావేశంలో పాశిగామ, స్తంభంపల్లి గ్రామాల ప్రజలు, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూమి చదును పనుల అడ్డగింత

మెట్‌పల్లి(కోరుట్ల): జగ్గాసాగర్, రాంలచ్చక్కపేట గ్రామాల మధ్య సరిహద్దు విషయంలో వివాదం ఏర్పడింది. వివరాల్లోకి వెళ్తే.. రెండు పల్లెల శివారులోని వరద కాల్వకు చెందిన భూమిలో సోమవారం హరితోత్సవం చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మొక్కలు నాటడానికి రాంలచ్చక్కపేటకు చెందినవారు ఆదివారం జేసీబీని పంపించి, చదును చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న జగ్గాసాగర్ వాసులు అక్కడికి చేరుకొని, పనులు అడ్డుకున్నారు. సదరు భూమి తమ గ్రామ పరిధిలోకి వస్తుందని ఆందోళనకు దిగడంతో పోలీసులు వచ్చారు. భూమి ఎస్సారెస్పీకి చెందిందని, ఆ అధికారులతో మాట్లాడి, సమస్య పరిష్కరించుకోవాలని నచ్చజెప్పడంతో వెళ్లిపోయారు.

ఆలయంలో చోరీ

కథలాపూర్(వేములవాడ): ఇప్పపెల్లి శివారు పెద్దమ్మతల్లి దేవాలయంలో చోరీ జరిగినట్లు ముదిరాజ్ సంఘం సభ్యులు తెలిపారు. శనివారం అర్ధరాత్రి తర్వాత ఆలయంలో దొంగలు చొరబడి, 25 తులాల వెండి ఆభరణాలు, అర తులం బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని పోలీసులు ఆదివారం పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో తనిఖీలు చేపట్టి, వివరాలు సేకరించారు.

జిల్లాకు పుస్తకాలొచ్చాయ్

- 20 మండలాలకు తరలించినవి 3,62,370
- ప్రభుత్వ పాఠశాలల్లో 71,640 మంది విద్యార్థులు

జిల్లాలో పాఠశాలల వివరాలు

ప్రభుత్వ పాఠశాలలు	: 783
కస్తూరిబా విద్యాలయాలు	: 14
మోడల్ స్కూళ్లు	: 13
గురుకులాలు	: 25
విద్యార్థుల సంఖ్య	: 71,640


మల్లాపూర్ ఎమ్మార్సీలో పంపిణీకి సిద్ధంగా పాఠ్యపుస్తకాలు

మల్లాపూర్(కోరుట్ల): 2023–24 విద్యా సంవత్సరానికి గాను 3,62,370 పాఠ్యపుస్తకాలు జగిత్యాల జిల్లాకు చేరాయి. ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు అందించేందుకు అధికారులు వాటిని మండలాలకు తరలించారు. జిల్లాలోని 20 మండలాల్లో 71,640 మంది విద్యార్థులకు వాటిని పంపిణీ చేయనున్నారు.

3 నుంచి బడిబాట..

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అధికారులు ఈ నెల 3 నుంచి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. సర్కారు బడుల్లో 10, 9.8, 9.5 జీపీఏ సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, హెచ్ఎంలను, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ నెల 12న ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో హెచ్ఎంలు, టీచర్లు మండల కేంద్రాల్లోని ఎమ్మార్సీల నుంచి పాఠ్యపుస్తకాలను తీసుకెళ్తున్నారు. గతేడాది మాదిరిగానే వాటిపై సీరియల్ నంబర్లు ముద్రించి, విద్యార్థులకు ఇవ్వనున్నారు. పిల్లల ఆధార్‌కార్డు నంబర్ అనుసంధానం చేసుకొని, పుస్తకంపై ఉన్న సీరియల్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు.

మండలాల వారీగా విద్యార్థుల సంఖ్య

బీర్‌పూర్–1,529, భీమారం–1,657, బుగ్గారం–856, ధర్మపురి–3,538, ఎండపల్లి–1,608, గొల్లపల్లి–3,386, ఇబ్రహీంపట్నం–3,120, జగిత్యాల–4,366, జగిత్యాల రూరల్–3,853, కథలాపూర్–4,053, కొడిమ్యాల–2,593, కోరుట్ల–6,459, మల్లాపూర్–4,385, మల్యాల–3,348, మేడిపల్లి–2,766, మెట్‌పల్లి–4,970, పెగడపల్లి–2,290, రాయికల్–4,479, సారంగాపూర్–1,897, వెల్గటూర్ మండలంలో 2,145 మంది విద్యార్థులు ఉన్నారు.

ఆధార్ ఉంటేనే ఇస్తారు..

పాఠ్యపుస్తకాలు కావాలంటే విద్యార్థులకు ఆధార్ కార్డు తప్పనిసరిగా మారింది. వాటిపై క్రమసంఖ్య నమోదు చేయడంతో కార్డు ఉన్నవారికే ఇచ్చి, లేని వారికి నిలిపివేస్తారు. అన్ని పాఠశాలల విద్యార్థుల సంఖ్యను ఇప్పటికే చైల్డ్ ఇన్ఫోలో అప్‌లోడ్ చేశారు. వాటి ఆధారంగానే జిల్లాకు పాఠ్యపుస్తకాలు వచ్చాయి. ఆధార్ సంఖ్య లేని విద్యార్థుల పేర్లు ఆ వెబ్‌సైట్‌లో కనిపించవు.

విద్యార్థులను చేర్పించాలి



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం పొందిన ప్రతీ విద్యార్థికి పాఠ్యపుస్తకాలను సకాలంలో అందజేస్తాం. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తమవంతు బాధ్యతగా పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి. పాఠ్యపుస్తకాలు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నాయి. వాటిని మండలాల వారీగా ఎమ్మార్సీలకు తరలించాం.

– జగన్మోహన్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి

రెండు కార్లు ఢీకొని ఒకరి దుర్మరణం

- ఇద్దరికి గాయాలు


శివశంకర్ (ఫైల్)

జగిత్యాల క్రైం: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన కట్ట శివశంకర్(46), అతని స్నేహితుడు చంద్రశేఖర్ వ్యాపారం నిమిత్తం ఆదివారం ఉదయం కారులో ఆర్మూర్ వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా బీమారం మండలంలోని పసునూరు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు ఈర్నాల తిరుపతి కారులో వెళ్తున్నాడు. జగిత్యాల అర్బన్ మండలంలోని హస్నాబాద్ శివారులో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శివశంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. చంద్రశేఖర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, తిరుపతి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. శివశంకర్ మృతితో మంచినీళ్ల బావి ప్రాంతంలో విషాదం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య లత, కుమారుడు ఉన్నారు.

యువకుడి ఇంటి ఎదుట యువతి బైఠాయింపు

వెల్గటూర్(ధర్మపురి): తనకు న్యాయం చేయాలంటూ ఓ యువతి ఓ యువకుడి ఇంటి ఎదుట బైఠాయించిన ఘటన వెల్గటూర్ మండలంలోని వెంకటాపూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలం మున్యాలకు చెందిన ఓ యువతి తన అమ్మమ్మ గ్రామమైన వెంకటాపూర్‌లో ఉంటూ చదువుకుంది. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. కానీ అతను గల్ఫ్ వెళ్లిపోయాడు. ఈ క్రమంలో ఆ యువతికి ఇటీవలే మరో వ్యక్తితో వివాహం జరిగింది. గల్ఫ్ వెళ్లిన యువకుడు కొన్ని రోజుల క్రితం స్వగ్రామం రాగా అతనితో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కానీ మనసు మార్చుకున్న ఆ యువకుడు ఆమెను జన్నారంలో వదిలి వెళ్లిపోయాడు. తనకు న్యాయం చేయాలంటూ బాధితురాలు ఆదివారం యువకుడి ఇంటి ఎదుట బైఠాయించింది. కానీ అంతకుముందే అతను ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి ఎక్కడికో వెళ్లిపోయాడు.

దాడి ఘటనలో తల్లీకుమారుడిపై కేసు

జగిత్యాల క్రైం: జగిత్యాల పట్టణ శివారులోని లింగంపేటకు చెందిన సిరికొండ లక్ష్మణ్‌పై గొడ్డలితో దాడి చేసిన అతని తమ్ముడు రమేశ్, కళ్లలో కారంపొడి చల్లిన తల్లి భూదవ్వలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సిరికొండ లక్ష్మణ్, రమేశ్‌ల మధ్య రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న వ్యవసాయ భూమి హద్దుల విషయంలో శనివారం గొడవ జరిగింది. తల్లిదండ్రులకు చెప్పేందుకు లక్ష్మణ్ వారు ఉంటున్న ఇంటికి వెళ్లగా రమేశ్ వెనక నుంచి వచ్చి గొడ్డలితో దాడి చేశాడు. ఈ ఘటనలో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. తల్లి భూదవ్వ కళ్లలో కారంపొడి చల్లడంతో అక్కడే స్పృహతప్పి పడిపోయాడు. స్థానికులు విషయాన్ని లక్ష్మణ్ భార్యకు చెప్పడంతో ఆమె బంధువుల సహాయంతో అతన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అతని తమ్ముడు, తల్లిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


అనిల్ రెడ్డి (ఫైల్)

ఇల్లంతకుంట (మానకొండూర్): ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గాలిపల్లి గ్రామానికి చెందిన కోమటిరెడ్డి అనిల్ రెడ్డి (27) రెండేళ్లుగా తల్లిదండ్రులు సుధాకర్‌రెడ్డి– శ్యామలతో కలిసి హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఆదివారం సాయంత్రం హోటల్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో అనిల్ ఆత్మహత్య చేసుకున్నాడా... ఇతరత్రా కారణాలు ఏమైనా ఉన్నాయా అని స్థానికులు భావిస్తున్నారు. మృతదేహాన్ని సిరిసిల్ల మార్చురీకి తరలించారు. ఘటనా స్థలాన్ని హెడ్ కానిస్టేబుల్ మంద లక్ష్మణ్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రహీం అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాలు.. హుజురాబాద్ మండలం కందుగుల గ్రామానికి చెందిన రహీం, సంపత్ మోటార్‌సైకిల్‌పై కరీంనగర్ నుంచి స్వగ్రామం వెళ్తున్నారు. మండలంలోని కొత్తగట్టు సమీపంలోకి రాగానే వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రహీంకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. ఈఎమ్‌టీ సురేశ్ ప్రథమ చికిత్స చేసి హుజురాబాద్ ఆస్పత్రికి తరలించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


కాలిపోయిన వస్తువులు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ గ్రామానికి చెందిన బోగ రాజమౌళి ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో ఆదివారం దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. ఉదయం విద్యుత్ సర్క్యూట్ జరిగి మంటలు అంటుకున్నాయి. ఇంట్లోని బీరువాతో పాటు, దాచుకున్న చిట్టీ డబ్బులు రూ.3 లక్షలు, మరో రూ.2 లక్షల విలువైన వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

చెట్టు నరికిన వ్యక్తికి జరిమానా

మంథని: మంథని మున్సిపాలిటీలోని ఓ హోటల్‌కు అడ్డుగా ఉందని చెట్టును నరికిన వ్యక్తికి అటవీ శాఖ అధికారులు రూ.3,318 జరిమానా విధించారు. చెట్టు నరుకుతున్న వీడియోను తీసి అధికారులకు ఫిర్యాదు చేయడంతో అటవీ, మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


విజయ్ (ఫైల్)

రాయికల్(జగిత్యాల): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలంలోని కోమటికొండాపూర్ గ్రామానికి చెందిన రెబ్బాస్ విజయ్(27) కొన్నేళ్లు గల్ఫ్ వెళ్లి వచ్చాడు. నెల రోజుల క్రితమే అతనికి వివాహమైంది. ఈ క్రమంలో మైతాపూర్‌కు చెందిన స్నేహితుడు గల్ఫ్ వెళ్తున్నాడని తెలిసి, అతనితో మాట్లాడేందుకు ఆదివారం ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. మైతాపూర్ శివారులోకి రాగానే స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో విజయ్ తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..


అంజవ్వ (ఫైల్)

రుద్రంగి(వేములవాడ)/కోరుట్ల: రుద్రంగి మండల కేంద్రానికి చెందిన దాసరి అంజవ్వ (65) కాలు విరగడంతో శుక్రవారం రాత్రి కోరుట్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆపరేషన్ చేశారు. ఆమె చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. సర్జరీ ఫెయిలవడం వల్లే చనిపోయిందని బంధువులు మృతదేహంతో దవాఖానాలో, రుద్రంగి మండల కేంద్రంలోని కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. పోలీసులు సముదాయించడంతో విరమించారు.

కూచిరాజ్‌పల్లికి చెందిన యువకుడు..


సంతోష్ (ఫైల్)

మంథని: మంథని మున్సిపాలిటీ పరిధి కూచిరాజ్‌పల్లిలో దాసరి సంతోష్(28) గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఎస్సై వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. సంతోష్ తన తమ్ముడికి వివాహం కాగా, తనకు మాత్రం కావడం లేదని బాధతో తాగుడుకు బానిసై ఏం పనిచేయడం లేదు. ఈ నెల 16న గ్రామ శివారులోని నందికట్ట ప్రాంతంలో మద్యం సేవించి తర్వాత గడ్డి మందు తాగాడు. విషయం తన మిత్రుడికి చెప్పడంతో అక్కడికి వెళ్లి చూడగా అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి, పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి బలవన్మరణం


నర్సవ్వ మృతదేహం

మల్యాల(చొప్పదండి): వ్యవసాయ బావిలో దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మల్యాల మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన దుబ్బాక నర్సవ్వ (66) ఆదివారం గ్రా మ శివారులోని వ్యవసాయ బావిలో దూకింది. స్థా నికులు గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి, మృతదేహాన్ని బయటకు తీయించా రు. పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు.

ఖిలావనపర్తిలో విద్యార్థి..

ధర్మారం(ధర్మపురి): ఖిలావనపర్తికి చెందిన విద్యార్థి కుందేళ్ల చందు (19) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చందు ఇంటర్ పూర్తి చేశాడు. తల్లిదండ్రుల వద్ద డబ్బులు లేక తాను పై చదువులు చదవలేననే బెంగతో జీవితంపై విరక్తి చెంది, ఆదివారం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

‘దళితులపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం’


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సురేష్‌మాదిగ

మల్లాపూర్(కోరుట్ల): దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఎమ్మార్పీఎస్ జిల్లా కో–కన్వీనర్ బలవంతుల సురేష్‌మాదిగ అన్నారు. ఆదివారం మల్లాపూర్ మండలంలోని సాతారం గ్రామంలో సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఇటీవలి కాలంలో దళితులపై దాడులు ఎక్కువ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణపై మాట తప్పిన కేంద్ర ప్రభుత్వం, ఎస్సీ రిజర్వేషన్ల వ్యతిరేక శక్తులు, వారికి వత్తాసు పలికే నేతలకు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అనంతరం సాతారం గ్రామ కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా చిట్యాల కార్తీక్‌మాదిగను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర నాయకుడు, మండల ఇన్‌చార్జి మాట్ల బుచ్చయ్య మాదిగ, కోరుట్ల మండల కన్వీనర్ బంగారి ప్రమోద్, నాయకులు కుంటాల శ్రీనివాస్, బొల్లె రఘుపతి, ఎర్ర భాను, బాలాజీ, తేజ తదితరులు పాల్గొన్నారు.

జువ్వాడి కుటుంబానికి పరామర్శ


నివాళి అర్పిస్తున్న మాజీ ఎంపీ వివేక్, నాయకులు

ధర్మపురి: మాజీ మంత్రి దివంగత జువ్వాడి రత్నాకర్‌రావు సతీమణి సుమతీదేవి ఇటీవల మృతిచెందిన విషయం విదితమే. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, పెద్దపెల్లి మాజీ ఎంపీ వివేక్, ధర్మపురి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు గజ్జెల స్వామి ఆదివారం తిమ్మాపూర్‌లోని బాధిత కుటుంబీకుల ఇంటికి వెళ్లారు. ఆమె చిత్రపటానికి నివాళి అర్పించి, కుమారులు జువ్వాడి నర్సింగరావు, నవనీతకృష్ణారావు, చంద్రశేఖర్‌రావులను పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పిల్లి శ్రీనివాస్, బండారి లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు కొమురయ్య, సంతోష్, అజయ్, ఎంపీటీసీ సభ్యుడు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ‘ట్రినిటీ’ సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్: జేఈఈ(అడ్వాన్స్‌డ్) ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అద్భుత ర్యాంకులతో సత్తా చాటారు. ఎ.అభిరామ్ 415వ ర్యాంకు, ఎస్.సాచి 800, జి.దిలీప్ 908, కె.గోపాల్ 1,017, జి.గంగాధర్ 1,117, ఎం.రాజారెడ్డి 1,137, ఎస్.సుహాస్‌రెడ్డి 1,430, పి.అభినయ 1,674వ ర్యాంకు సాధించారు. ఈసందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, వివిధ బ్రాంచ్‌ల ప్రిన్సిపాల్స్, అభినందించారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం


పల్లె బిందు


పవన్ సూర్య


శ్రీవాత్సవ


సాయిప్రభాస్

కరీంనగర్: జేఈఈ మెయిన్స్ –2023 ఫలితాల్లో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరచి జాతీయస్థాయి ర్యాంకులతో ప్రభంజనం సృష్టించారు. ఎస్.పవన్ సూర్య 903వ ర్యాంకు, పల్లె బిందు 2,467, మారుపాక శ్రీవాత్సవ 3,159, కల్వల సాయిప్రభాస్ 4,295వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ, అంకితభావంతో కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదన్నారు. నాణ్యమైన కార్పొరేట్ స్థాయి విద్యను ఉత్తర తెలంగాణ ప్రాంత విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో శ్రీచైతన్య విద్యా సంస్థలు నడుస్తున్నాయని వివరించారు. శ్రీ చైతన్య గ్రూప్ ఆఫ్ జూనియర్ కళాశాల స్థాపించిన నాటి నుంచి రాష్ట్రస్థాయి ర్యాంకులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను శ్రీచైతన్య విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, కళాశాలల డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, డీన్ జగన్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

ఐఐటీ ఫలితాల్లో ‘శ్రీచైతన్య ఐపీఎల్’ ప్రతిభ

కరీంనగర్: జేఈఈ అడ్వాన్స్–2023 పరీక్షా ఫలితాల్లో కరీంనగర్‌లోని శ్రీ చైతన్య ఐపీఎల్ విద్యార్థులు సత్తాచాటారు. జిందం శ్రీనాథ్ ఆల్ ఇండియా 151వ ర్యాంక్, ఎం. రిషికేష్ ఆల్‌ఇండియా 158వ ర్యాంక్ సాధించారు. ఏ.శశిధర్ 902, టి.మణిశరవన్‌గౌడ్ 11,24, బి.అరిన్‌పటేల్ 1,726, ఎస్.సాయికృష్ణ 4,548, ఎం.హర్షిత్ 5,076, పి.కీర్తి 6,012, జె.శ్రీజ 8467 ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం లక్ష్మణరావు, ఆర్ఐ రాజు, కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్, ఐపీఎల్ ఇన్‌చార్జి శ్రీకాంత్‌రెడ్డి, సీ బ్యాచ్ ఇన్‌చార్జి మధుకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

వడదెబ్బతో అనాథ మహిళ మృతి


కనకవ్వ (ఫైల్)

మానకొండూర్: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన గంధం కనకవ్వ (65) వడదెబ్బతో మృతిచెందగా ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కనకవ్వ ఇదే మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని వివాహం చేసుకోగా అతడు గతంలోనే మృతిచెందాడు. బతికేందుకు ఆమెకు జీవనాధారం లేకపోవడంతో కరీంనగర్లోని ఆలయాల వద్ద భిక్షాటన చేస్తూ గడిపేది. కాగా శనివారం ఓ ఆలయం వద్ద భిక్షాటన చేస్తూ వడ దెబ్బతో మృతిచెందగా మృతదేహాన్ని స్థానిక పోలీసులు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం ఉదయం మృతురాలి వివరాలు తెలుసుకున్న పోలీసులు లింగాపూర్ గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామానికి చెందిన మోట సమ్మయ్య, కులస్తులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

అదుపుతప్పి ఊక లారీ బోల్తా



బోల్తా పడిన లారీ, కారు

కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ విలీన గ్రామమైన యెఖీన్‌పూర్ శివారులో కోరుట్ల–వేములవాడ రోడ్డుపై ఆదివారం సాయంత్రం ఊక తరలిస్తున్న ఓ లారీ అదుపుతప్పి, బోల్తా పడింది. వేములవాడ వైపు నుంచి కోరుట్ల వైపు వస్తున్న రాజస్థాన్‌కు చెందిన లారీ ఓవర్ లోడ్‌తో ఉండటంతో కెనాల్ మ లుపు వద్ద బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

డివైడర్‌ను ఢీకొని కారు..

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి గ్రామ శివారులో ప్రధాన రహదారిపై డివైడర్‌ను ఢీకొని కారు బోల్తాపడిన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రం నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు పద్మనగర్ గ్రామ శివారుకు చేరుకోగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. కారులో ఉన్న నలుగురికి స్వల్పగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.